క్లుప్తంగా

జాతీయ సమైక్యత చాటుదాం



హర్ ఘర్ తిరంగా యాత్రను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పిలుపునిచ్చారు. బుధవారం మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర చేపట్టారు. చైర్‌పర్సన్ భవాని ప్రారంభించిన ఈ యాత్ర ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాలను ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరమణయ్య, ఏసీ లావణ్య, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, సీఓలు, ఆర్‌పీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్

గుంతకల్లు రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన సమయంలో టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. బుధవారం మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబుతో కలిసి కసాపురంలోని సబ్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లోని రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు, వారి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం అందేలా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా అని ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ సెంటర్ సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం



మనోజ్ కుమార్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

గుత్తి: పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన పదో తరగతి విద్యార్థి మనోజ్ కుమార్ రెండు రోజుల క్రితం అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం గుత్తిలోని అనంతపురం రోడ్డులో ఒంటరిగా ఉన్న మనోజ్ కుమార్‌ను గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మనోజ్ కుమార్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లిన అనంతరం తల్లిదండ్రులు కుళ్లాయి స్వామి, చౌడమ్మకు అప్పగించారు.

మహిళ అదృశ్యం



ఎస్తరమ్మ (ఫైల్)

గుత్తి: ఓ మహిళ అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం పెద్ద నెలటూరు గ్రామానికి చెందిన ఎస్తరమ్మ ఈనెల 9వ తేదీన గుత్తిలోని బైబిల్ మిషన్ చర్చికి వచ్చింది. అయితే తిరిగి ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు ఎస్తరమ్మ ఆచూకీ కోసం చుట్టు పక్కల గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఎస్తరమ్మ కుటుంబ సభ్యులు సీఐ రాజశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఎంపీడీఓలకు సత్కారం



ఎంపీడీఓలను సత్కరిస్తున్న దృశ్యం

యాడికి: విధి నిర్వహణలో అధికారులు ప్రజలకు అందించిన సేవలను ప్రజలు జీవితాంతం గుర్తించుకుంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ సావిత్రితో పాటు కర్నూలు జిల్లా ఆస్పరి నుంచి యాడికి మండలానికి బదిలీపై వచ్చిన ఎంపీడీఓ లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందేదెన్నడో?

- పంటల సాగుకు ప్రోత్సాహకం కరువు
- ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించని ప్రభుత్వం
- ఆందోళనలో అన్నదాతలు

పామిడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తోంది. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామని చెప్పిన రూ.20 వేలు చెల్లించడం లేదు. ఎన్నికలకు ముందు అన్నీ నెరవేరుస్తామని చెప్పిన నాయకులు.. ఇప్పుడు హామీలపై నోరు మెదపడం లేదు. ఖరీఫ్ సీజన్ దాటినా అన్నదాతలకు ప్రభుత్వ సాయం అందకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి 6,765 ఎకరాల్లో, వేరుశనగ 4542.5 ఎకరాల్లో, కంది 3,900 ఎకరాల్లో, ఆముదం 1,065 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా పంటల సాగుకు ముందే రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. పంటల ప్రీమియం చెల్లించి పంట నష్టపోయిన రైతులను వైఎస్ జగన్ ఆదుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధిత ఉచిత పంటల బీమా ప్రీమియం ఇప్పటి వరకూ చెల్లించలేదు. దీంతో రైతన్నకు పంటల బీమా పరిహారం అందని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో అన్నదాతల ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం బీమా ప్రీమియం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.



కాలాపురం వద్ద మొలకెత్తని జొన్న

ఆశించినట్లు వర్షాలు పడలేదు



రామరాజుపల్లిలో మాకున్న 30 ఎకరాల పొలంలో వర్షాధారం కింద వివిధ పంటలు సాగు చేశాం. 15 ఎకరాల్లో కంది, 7 ఎకరాల్లో పత్తి, 6 ఎకరాల్లో కొర్ర, 2 ఎకరాల్లో వేరుశనగ పంటల సాగుకు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టాను. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురువలేదు. దీంతో పంటల దిగుబడిపై ఆశ సన్నగిల్లుతోంది. కూటమి ప్రభుత్వం రైతులకు సాయం అందించాలి.

– వీ దేవేంద్రరెడ్డి, రామరాజుపల్లి

బీడు పెట్టాను..



నాకు 13 ఎకరాల పొలం ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల 4 ఎకరాల్లో రూ.20 వేలు పెట్టుబడితో కొర్ర సాగు చేశా. 9 ఎకరాలు బీడుగా వదిలేశాను. సకాలంలో ఆశించిన రీతిలో వర్షాలు కురువక పోవడం రైతన్నల పాలిట శాపమైంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి అన్నదాతలను ఆదుకోవాలి.

– నారపరెడ్డి, రైతు, పీ కొండాపురం

ప్రభుత్వానికి నివేదించాం



మండలంలో పత్తి, వేరుశనగ, కంది, కొర్ర, ఆముదం తదితర పంటలు 17 వేల ఎకరాల్లో సాగయ్యాయి. ఖరీఫ్ సీజన్ దాటిన ఆశించిన స్థాయిలో వర్షాలు కురువపోడం వల్ల రైతులు చింతించాల్సిన అవసరం లేదు. చిరుధాన్యాల పంటల సాగుతో రైతులు లబ్ధి పొందవచ్చు. అన్నదాతలకు అందాల్సిన ప్రభుత్వ సాయానికి సంబంధించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం.

– డీ లీనా వసుంధర, ఏఓ, పామిడి

సర్పంచులకు ముగిసిన శిక్షణ

బుక్కరాయసముద్రం: ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా సాగుతున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ తేజోత్స్న మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

పుట్లూరు: ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ బుధవారం ముగిసింది. ఎంపీడీఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ శిక్షణలో అందించిన సూచనలు, సలహాలను పాటిస్తూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమిష్టిగా పని చేసి తమ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్ పాల్గొన్నారు.

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వీరరాజు అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా 2024–2025కు సంబంధించి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళికలపై వివరించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ విధానంపై తెలియజేశారు. ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ ఉమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోత్స్న

అనుమతులు ఎక్కువ.. అభివృద్ధి తక్కువ

- ప్రజాభిప్రాయ సేకరణలో కొండుపల్లి గ్రామస్తుల ఆవేదన

పెద్దవడుగూరు: మండలంలోని కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల్లో మైనింగ్ గనులకు అధికారులు అనుమతులు ఎక్కువగా ఇస్తున్నారు. అయితే గనుల యజమానులు మాత్రం గ్రామాన్ని అభివృద్ధి చేయడం లేదని క్రిష్టిపాడు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని కొండుపల్లి గ్రామంలో ఎస్‌వీ మైన్స్ అండ్ మినరల్స్ మైనింగ్ గని నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ మైనింగ్ గని నిర్వహణ యజమానులు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. ప్రజలకు, జంతువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం క్రిష్టిపాడు యువకులు మాట్లాడుతూ ఖనిజ సంపదను అమ్ముకొని డబ్బులను దోచుకుంటున్నారని, గ్రామంలో ఒక్క మంచి పని కూడా చేయల్లేదని వాపోయారు. పరిశ్రమలకు ప్రజలు వ్యతిరేకం కాదన్నారు. గని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎన్‌జీఓ ప్రతినిధులు మాట్లాడుతూ గనుల యజమానులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. డీఎంఎఫ్‌తో గ్రామంలో రోడ్లు వేయించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎస్ఆర్ బడ్జెట్‌లో నిధులు కేటాయించి మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ అధికారి కిషోర్‌రెడ్డి, డీటీ వెంకటేశ్వరమ్మ, ప్రజలు పాల్గొన్నారు.



కొండుపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాసరెడ్డి

జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలి

శింగనమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1990 నుంచి సైన్స్ గ్రూపులు తీసేశారన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులు సైన్స్ గ్రూపులు చదివేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. శింగనమలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. శింగనమలలో బాలికల వసతి గృహం కోసం భవనాలు నిర్మించినా వసతిగృహం నిర్వహించడం లేదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సును నడపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్య ప్రకాష్, నాయకులు అభిషేక్, జాన్సన్, హర్ష, గంగాధర, సాయి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎస్ఎస్ ట్యాంకుల్లోకి నీటి పంపింగ్

గుంతకల్లుటౌన్: హంద్రీనీవా సుజల స్రవంతి కెనాల్ ద్వారా ప్రవహిస్తున్న కృష్ణా జలాలను మున్సిపల్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లోకి పంపింగ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే జయరాం తెలిపారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానితో కలిసి పంప్‌హౌస్ వద్ద హంద్రీనీవా కెనాల్‌లో కృష్ణా జలాలకు పూజలు చేశారు. అనంతరం మోటార్ స్విచ్‌లను ఆన్ చేసి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. నీటి పంపింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం పంప్‌హౌస్ పరిసరాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ఎంఈ గురప్ప, డీఈలు హేమచంద్ర, సుమ, రామ్మూర్తి, ఏఈలు హరికృష్ణ, సుదర్శన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చెరువులకు నీటి విడుదల..

గుంతకల్లు రూరల్: టీడీపీ పాలనలో గుంతకల్లు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నిలుపుతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని కసాపురం వద్ద నున్న హంద్రీనీవా కాలువ తూము నుండి పాతకొత్తచెరువు, వైటీ చెరువు, గుత్తి చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా తూము వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా కసాపురం తూము నుంచి నియోజకవర్గంలోని చెరువులకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.



కృష్ణాజలాలకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే జయరామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ

అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు



అంగన్‌వాడీ కార్యకర్తను సన్మానిస్తున్న దృశ్యం


గుత్తి: రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకుని బాధ్యతగా విధులు నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను సన్మానించినట్లు సీడీపీఓ ఢిల్లీశ్వరి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో 50 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆరుగురు ఆయాలు, 8 మంది సూపర్‌వైజర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

పామిడిలో..

పామిడి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలానికి సంబంధించి నలుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను బుధవారం ఉత్తమ అవార్డులతో సత్కరించారు. పామిడి సెక్టార్‌కు గాను స్థానిక మంజునాథ్ టాకీస్ అంగన్‌వాడీ కార్యకర్త కె.జయంతి, సుదర్శన్ టాకీస్ అంగన్‌వాడీ కార్యకర్త ఎన్.అనిత, ఎద్దులపల్లి సెక్టార్‌కు సంబంధించి పాళ్యంతండా అంగన్‌వాడీ కార్యకర్త మహలక్ష్మి, ఎద్దులపల్లి అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మకు అవార్డులు దక్కాయి. గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు ప్రశంసాపత్రాలతో పాటు శాలువాలు కప్పి సత్కరించారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట

యల్లనూరు: స్థానిక పాతపేటలో బుధవారం చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. అర్చకుడు కిషోర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్టించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.



నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని ఏ.తిమ్మాపురం గ్రామంలో గురువారం ఉదయం మై హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుండెకు సంబంధించి రోగాలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. క్యాంపునకు వచ్చే వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు తప్పకుండా తీసుకొని రావాలని సూచించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బంది

తాడిపత్రి రూరల్: మండలంలోని తలారి చెరువు వద్ద గల ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో బుధవారం చీఫ్ మేనేజర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో 200 మొక్కలు నాటారు. పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మొక్కలు పెంచడం వల్ల వాతావరణ పరిస్థితులు సమతూల్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మైన్స్ మేనేజర్ రామక్రిష్టారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు హైస్కూల్‌లో బుధవారం ఎయిడ్స్‌పై అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుందో మెడికల్ ఆఫీసర్ లావణ్య తెలియజేశారు. ముందు జాగ్రత్త చర్యలను వివరించారు.



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ లావణ్య

ట్రాక్టర్ ట్రాలీ మీద పడి రైతు మృతి

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ట్రాలీ మీద పడి సుంకన్న (45) అనే రైతు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు సుంకన్న బుధవారం రాత్రి భోజనం చేసిన తరువాత పొలంలో ఉన్న గడ్డి తెచ్చేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. అయితే పొలానికి వెళ్లిన తరువాత ట్రాలీని పైకి ఎత్తాడు. అయితే ట్రాలీ కిందకు దిగకపోవడంతో చూసేందుకు ఇంజన్ దిగి వెనక్కు వెళ్లాడు. ట్రాలీని గమనిస్తుండగా.. అది ఒక్కసారి సుంకన్న మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే సుంకన్న ఎంత సేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే సుంకన్న ట్రాలీ కింద విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సుంకన్న అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరరాజు

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ కింద జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ వీరరాజు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. రైతు పొలాల్లో చుట్టూ కంచెలాగా మొక్కలు నాటుకోవాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలకు పనులు కల్పించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లూ, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పామిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: పీఎం మోదీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీసీసీ రోడ్డుపై పొడవాటి జెండాతో భారత్ మాతాకు జై, స్వాతంత్ర్య సమరయోధులకు జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. స్వాతంత్ర్య సముపార్జనలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగనిరతిని వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు విష్ణుకాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు చౌహాన్ అంజి నాయక్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, పూజారి లక్ష్మీదేవి, విద్యా మందిరం కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, జోజుడే కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుమార్, మంజునాథ్ రావు, సరస్వతీ ఉన్నత విద్యామందిరం, నలంద, చైతన్య, ట్రినిటీ, ఎస్ఎఫ్ఎస్ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న ఓ తోటలో బుధవారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.28,300 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సత్యంరెడ్డి తోటను గుత్తకు తీసుకొని పేకాట ఆడిస్తున్నాడన్న సమాచారంతో దాడులు జరిపామన్నారు.